సాక్షి
రంగారెడ్డి

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



సమర'భేరి'

తుక్కుగూడ వేదికగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరి బహిరంగ సభ విజయవంతమైంది. 8లో▸



అన్ని రంగాల్లో అభివృద్ధి

సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. 9లో▸

ఆ నలుగురి అరెస్టు

ఆమనగల్లు: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ ప్రారంభోత్సవానికి వెళ్తున్న సీఎం కాన్వాయ్‌ను అడ్డుకోబోయిన నలుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బల్‌రాం తెలిపారు. అరెస్టయిన వారిలో ఆమనగల్లు మండలం పోలెపల్లికి చెందిన ఒగ్గు ప్రభాకర్, సంపంగి బాలకృష్ణ, ఓర్స్ శ్రీకాంత్, అవునూరి శ్రీహరి ఉన్నారు.



జాతీయ పతాకంతో అభిమాని సందడి



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ ప్రముఖులు

సమర'భేరి'

తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

- ఆశించిన దానికంటే అధిక సంఖ్యలో హాజరైన జనం
- ఓఆర్ఆర్ సహా సర్వీసు రోడ్లపై ఎక్కడికక్కడే నిలిచిన వాహనాలు
- కేడర్‌లో నూతనోత్తేజం నింపిన ముఖ్యనేతల ప్రసంగాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తుక్కుగూడ వేదికగా ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరి బహిరంగ సభ విజయవంతమైంది. సభాస్థలితో పాటు ఓఆర్ఆర్, సర్వీసు రోడ్లన్నీ జనంతో నిండిపోయాయి. రోడ్లపై ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. సాయంత్రం ఆరు గంటల ఐదు నిమిషాలకు సీడబ్ల్యూసీ సభ్యులతో కూడిన బృందం సభాస్థలికి చేరుకుంది. ఆ తర్వాత కొద్ది సేపటికే సోనియా గాంధీతో పాటు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే చేరుకున్నారు. ఈ సమయంలో వేదికపై ఆసీనులైన పార్టీ ముఖ్యులతో పాటు వివిధ గ్యాలరీల్లో కూర్చొన్న కార్యకర్తలు, నాయకులు సీట్లో నుంచి పైకి లేచి నిటారుగా నిలబడి 'జై సోనియా' అంటూ అభివాదం చేశారు. నిజానికి సభకు ప్రియాంక గాంధీ కూడా హాజరవుతారని అంతా ఆశించారు. ఆమె గైర్హాజరవడంతో అభిమానులు కొంత నిరుత్సాహానికి గురయ్యారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకాన్ని సోనియాగాంధీ ప్రకటించగా, రైతు భరోసా పథకాన్ని జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. అభయహస్తం, చేయూత వంటి పథకాలను రాహుల్ గాంధీ ప్రకటించారు. ఒక్కోనేత ఒక్కో పథకాన్ని ప్రకటించడం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. సభా వేదికపై సోనియా 20 నిమిషాలే ఉన్నారు. ఐదు నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించారు. ఆమె వెళ్లిపోయిన తర్వాత మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి, తెలంగాణకు ఏం చేసిందో వివరించారు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే వర్గాలకు.. ఏంఏం చేయబోతోందో స్పష్టం చేశారు. చివరగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ముఖ్య నేతల ప్రసంగాలు కేడర్‌లో జోష్‌ను నింపాయి.

జన సమీకరణలో పోటీపడిన నేతలు

జన సమీకరణ విషయంలో నేతలు పోటీపడ్డారు. సభ నిర్వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరణ చేశారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దేప భాస్కర్‌రెడ్డి భారీగా జనాన్ని తరలించారు. చేవెళ్ల నేతలు సైతం ఈ విషయంలో పోటీ పడ్డారు. మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మెదక్ జిల్లాల నుంచి భారీగా జనం తరలి వచ్చారు. సభ కు హాజరైన వారిలో ఎక్కువగా యువతే కన్పించారు. వీరిలో విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు ఎక్కువగా ఉన్నారు. ముఖ్య నేతల దృష్టిలో పడేందుకు జిల్లా నేతలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీలు యత్నించారు. ఇందు కోసం తుక్కుగూడ–శ్రీశైలం జాతీయ రహదారి నుంచి సభాస్థలికి చేరుకునే మార్గంలో భారీ స్వాగత ద్వారాలు, ఫెక్సీలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సభకు భారీగా జనం తరలిరావడం, వెనుక ఉన్న బారీకేడ్లలో కుర్చీలు ఖాళీ లేక మీడియా గ్యాలరీలోకి చొచ్చుకు రావడం కొంత గందరగోళానికి దారితీసింది. వీరిని నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారు. దీంతో మీడియా ప్రతినిధులు సైతం ఇబ్బంది పడాల్సి వచ్చింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

'ప్రతి ఇంటిలోనా సోనియా బొమ్మ ఉండాలి.. అదే ఇంటిపై కాంగ్రెస్ జెండా ఎగరాలి' అంటూ ప్రముఖ గాయకుడు నైనాల రమేష్ కళాకారుల బృందం ప్రదర్శించిన కళారూపాలు సభికులను విశేషంగా అలరించాయి. ఆగదు..ఆగదు.. ఈ ఆకలిపోరు ఆగదు.., మూడు రంగుల జెండాపెట్టి..సింగమోలే కదిలినాడు మన రాహుల్‌గాంధీ.. నిగ్గదీసి అడిగే మొనగాడు పాటకు సభికులంతా ఒక్కసారిగా కుర్చీల్లోనుంచి పైకి లేచి డ్యాన్స్ చేశారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే సీతక్క, పీసీసీ మాజీ అధ్యక్షుడు హన్మంత రావు, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఖర్గే ప్రసంగాన్ని భట్టి తెలుగులోకి అనువదించగా, సోనియా, రాహుల్ గాంధీ ప్రసంగాలను ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనువదించారు. సభకు హాజరైన సామాన్య కార్యకర్తలు సైతం కళాకారులతో కలిసి నృత్యం చేయడం వారిలోమరింత జోష్‌ని నింపినట్లయింది.

ఆ నాలుగు గంటలు ట్రా'ఫికర్'

తుక్కుగూడకు వచ్చి వెళ్లే ప్రధాన మార్గాలు సహా ఓఆర్ఆర్‌పై కూడా భారీగా ట్రాఫిక్ జాం అయింది. సభకు వచ్చిన కార్యకర్తలు, నాయకుల వాహనాలతో పాటు సాధారణ ప్రయాణికుల వాహనాలు కూడా ఈ ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి పది గంటల వరకు ఇదే పరిస్థితి. ఇటు ఆదిబట్ల మొదలు.. అటు శంషాబాద్ వరకు.. పహడీషరీఫ్ మొదలు.. మహేశ్వరం కమాన్ వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వచ్చిన వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయకపోవడం, వచ్చిపోయే వాహనాలను ఇతర మార్గాల్లో మళ్లించకపోవడంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌లోనే గడపాల్సి వచ్చింది.



మల్లికార్జున ఖర్గేతో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, వేదికపై రేవంత్‌రెడ్డి, సోనియా, రాహుల్ తదితరులు



సపోర్టు పైపులపై నిలబడి ప్రముఖుల ప్రసంగాలు ఆసక్తిగా వింటున్న అభిమానులు



కళాకారుల ఆటాపాట



వేదికపై ఆసీనులైన పార్టీ జిల్లా నేతలు

విశ్వకర్మకు ఘన నివాళి

ఇబ్రహీంపట్నం రూరల్: విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హరీశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, విశ్వకరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాదేవి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తొలి పూజకు వేళాయే..

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో కొలువు తీరిన మహాగణపతి తొలిపూజలను నేటి ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఉదయం 9.30 గంటలకు ప్రాణ ప్రతిష్ట (కలశ పూజ) నిర్వహించిన అనంతరం పూజలు ప్రారంభమవుతాయన్నారు. తొలి పూజలు గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా జరుగుతాయన తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో గవర్నర్ తమిళిసైని కలిసి ఖైరతాబాద్ మహాగణపతి తొలిపూజలకు ఆహ్వానించారు. తొలిపూజలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి పాల్గొంటారు. మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.